

తాగునీటి ట్యాంకులు నింపేందుకు చర్యలు

జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆగడాలలంక కాలువ ద్వారా తాగునీటి ట్యాంకులు నింపేందుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంట పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ఏలూరులోని జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆర్డబ్ల్యుఎస్ ఎస్‌ఇ, డిఇ, ఎఇలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ ఆగడాలలంకా కాలువ ద్వారా తాగునీటి ట్యాంకులు నింపేందుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ ఎస్‌ఇని కోరారు. అదేవిధంగా ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జిల్లా పరిషత్ ద్వారా ప్రత్యేక నిధులను కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డున్నా.. రుణం ఇవ్వరు..!



కూటమి ప్రభుత్వంలోనూ కౌలురైతులకు అన్యాయం

కౌలు కార్డులిచ్చినా పంట రుణాలు మంజూరు నిల్

ఏలూరు జిల్లాలో 65 వేలకు కౌలు కార్డుల జారీ.. 23 వేల మందికే రుణం

'పశ్చిమ'లో 87వేలు కౌలు కార్డులు అందజేత.. 24 వేల మందికే పంట రుణం

జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం కౌలు రైతుల చేతుల్లోనే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వంలోనూ కౌలు రైతులకు న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. కౌలు కార్డులిచ్చిన రైతులకు సైతం బ్యాంకులు పంట రుణాలు ఇవ్వని పరిస్థితి కొనసాగుతోంది. రబీ సాగు ముగుస్తున్నా కౌలు రైతులకు అరకొర రుణాలతో మమ అనిపించిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి కౌలు రైతులు వ్యవసాయం చేయాల్సిన దుస్థితి. జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80శాతం కౌలు రైతులే వ్యవసాయ సాగు చేస్తున్నారు. బ్యాంకులిచ్చే పంటరుణాలు మాత్రం సాగుచేస్తున్న కౌలు రైతులకు ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కౌలు కార్డులు అందించిన రైతులకు సైతం పంట రుణాలు మంజూరు చేయకపోవడం అత్యంత దారుణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 65 వేల మంది కౌలు రైతులకు, పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల మంది కౌలు రైతులకు కౌలు కార్డులు జారీ చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 23,314 మంది కౌలు రైతులకు రూ.142.85 కోట్లు మాత్రమే పంట రుణాలు మంజూరు చేసినట్లు బ్యాంకర్ల మీటింగ్‌లో వెల్లడించారు. అధికారిక లెక్కల ప్రకారం చూసినా కౌలు కార్డులు అందుకున్న 41,686 మంది కౌలు రైతులకు ఒక్క పైసా పంట రుణం అందని పరిస్థితి నెలకొంది. కౌలు కార్డులు ఎందుకిచ్చినట్లో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. పశ్చిమగోదావరిలో 24 వేల మంది కౌలు రైతులకు రూ.235 కోట్లు పంట రుణాలు మాత్రమే ఇచ్చారు. కౌలు కార్డులు ఇచ్చిన 63 వేల మంది కౌలు రైతులకు పంట రుణం మంజూరు చేయని దుస్థితి నెలకొంది. జిల్లా వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఇప్పటివరకూ కౌలురైతులకు బ్యాంకులు జారీచేసిన పంటరుణాల లెక్కలు చెబుతున్నాయి. ఏలూరు జిల్లాలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి వ్యవసాయ రంగంలో స్వల్పకాలిక రుణాల కింద రూ.6,639 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంట్లో కౌలు రైతులకు ఇచ్చిన రుణం ఇప్పటివరకూ రూ.142.85 కోట్లు మాత్రమే. అంటే ఒక్కశాతం సొమ్ము కూడా కౌలు రైతులకు రుణాలుగా అందించని పరిస్థితి నెలకొంది. పశ్చిమలోనూ అదే పరిస్థితి కొనసాగుతోంది. కౌలు కార్డులు జారీ చేసిన రైతులకు సైతం పంటరుణాలు ఇవ్వకపోవడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి కౌలు రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. వ్యవసాయ సాగు చేయని భూ యజమానులు మాత్రం పంట రుణాలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వంలోనూ ఇదేపరిస్థితి కొనసాగ్గా, తాము అధికారంలోకి వస్తే కౌలురైతులకు న్యాయం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వంలోనూ అదేరీతి నడుస్తోంది.

కొత్త కౌలుచట్టం ఊసే మరిచారు..

తాము అధికారంలోకి వస్తే కౌలు చట్టంలో మార్పులు చేసి కౌలు రైతులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున హడావుడి చేసి పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పేరుతో సమావేశాలు సైతం నిర్వహించింది. అర్థాంతరంగా సమావేశాలు ఆపేసింది. తర్వాత కౌలుచట్టం గురించి మాట్లాడడం లేదు. బడ్జెట్ సమావేశాలు సైతం పూర్తయ్యాయి. కొత్త కౌలు చట్టం మాత్రం తీసుకురాలేదు. కొత్త కౌలు చట్టం వస్తే కౌలు రైతులకు ప్రభుత్వం అందించే బీమా, పంట నష్టపరిహారం, పంట రుణాలు వంటివి అందే అవకాశం ఉంటుందని రైతులంతా గంపెడాశతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం కౌలు రైతులను తీవ్రంగా వంచించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తితే చర్యలు

అధికారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

రానున్న వేసవిలో జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. కలెక్టరేట్లోని గౌతమీ సమావేశం హాల్లో గురువారం వేసవిలో తాగునీటి సరఫరా, జల జీవన్ మిషన్ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో వేసవిలో తాగునీటి సరఫరాపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలన్నారు. మండలస్థాయి అధికారులు తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. కాలువలకు నీటిని నిలిపివేసే లోగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో తాగునీటి వనరులను పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నాడు. బోర్ వెల్స్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా పురోగతిలో ఉన్న 325 పనులతో పాటు, ఇంకా ప్రారంభించని 108 పనులను కూడా దశలవారీగా చేపట్టి జూన్ నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ కె.భీమేశ్వరరావు, ఐటిడిఎ కె.రాములు నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ ఎస్‌ఇలు జి.త్రినాథబాబు, పి.నాగార్జునరావు, డిపిఒ అనురాధ, ఐసిడిఎస్ పీడీ శారద, డిఎంహెచ్ఒ మాలిని, డ్వామా పీడీ కెవి.సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏజెన్సీలో కల్వర్టు, వంతెనలను త్వరగా పూర్తి చేయాలి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ ప్రాంతంలో అన్ని కొండవాగులపై కల్వర్టు, వంతెనలను త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్ర నాలుగో రోజు గురువారం మండలంలోని కోర్సవారిగూడెం, అంతర్వేదిగూడెం, రెడ్డిగణపవరం, కోటనాగవరం, బుట్టాయగూడెం, లక్ష్ముడుగూడెం, జైనవారిగూడెం గ్రామ పంచాయతీల్లో యాత్ర కొనసాగింది. ఈ యాత్రలను ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ స్వాతంత్రం వచి 77 ఏళ్లు కావస్తున్నా ఏజెన్సీ గ్రామాల్లో కొండ వాగులపై కల్వర్టులు వంతెనల నిర్మాణం చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తక్షణమే అన్ని వాగులు కొండ కాలువలపై కల్వర్టులు నిర్మాణం చేపట్టాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఐటిడిఎకు గిరిజన ఉప సంచాలకులు (డిప్యూటీ డైరెక్టర్)ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రలో సిపిఎం నాయకులు పోలోజు నాగేశ్వరరావు, చంద్రు బుల్లెమ్మ, కె.భీమరాజు, ఎస్.సాయికృష్ణ, టి.శాంతి, కూరం సత్యనారాయణ, పి.అక్కమ్మ, కె.లక్ష్మి, శివ, లక్ష్మి, రాము, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో...



జంగారెడ్డిగూడెంలో...

జంగారెడ్డిగూడెం : జన చైతన్య యాత్రలో భాగంగా స్థానిక పంగిడిగూడెం రోడ్డులో ఉన్న బాట గంగనమ్మ లేఅవుట్ కాలనీలో సిపిఎం పట్టణ కమిటీ కన్వీనర్ పసల సూర్యారావు ఆధ్వర్యంలో యాత్ర బృందం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి పలు సమస్యలపై ఆరా తీశారు. పలువురు కాలనీవాసులు రోడ్ల సమస్య తీవ్రతరంగా ఉందని వాపోయారు. వీధి కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉందని, 20 మందిపై దాడి చేశాయని వివరించారు. సూర్యారావు మాట్లాడుతూ వెంటనే ఈ సమస్యను మున్సిపల్ కమిషనర్, ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు షేక్ మాబు సుభాని మాట్లాడుతూ పంగిడిగూడెం రోడ్డులోని నిర్మాణం పూర్తయిన సేవలకు నోచుకోని పట్టణ అర్బన్ ఆసుపత్రి వెంటనే ప్రారంభించి సేవలందించాలని కోరారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రారంభం కాని అర్బన్ ఆసుపత్రిని వెంటనే ప్రారంభించి పేదలకు వైద్య సహాయం అందించాలని సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ నాయకులు వంగ గోపీ, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంట కొనుగోలు చేయకపోతే పోరాటం తీవ్రతరం

కోకో రైతుల రాష్ట్ర సదస్సులో హెచ్చరిక

కంపెనీలు సిండికేట్‌గా మారి దోపిడీ : వై.కేశవరావు

సదస్సులో పలు తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, పెదవేగి

కోకో గింజలు కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కోకో రైతుల రాష్ట్ర సదస్సు హెచ్చరించింది. కంపెనీల మోసాలతో కోకో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని రాష్ట్ర సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం పెదవేగి మండలం విజయరాయి, గాంధీనగర్‌లోని సీతారామ కళ్యాణ మండపంలో ఎపి కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు బొల్లు రామకృష్ణ, బోళ్ల సుబ్బారావు, ఈడ్పుగంటి శ్రీనివాసరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సదస్సులో కోకో రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఏలూరు జిల్లాతో పాటు తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్‌టిఆర్, కోనసీమ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కోకో రైతులు హాజరయ్యారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ కోకో గింజలు కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కోకో తోటల సాగు ఉందని, ఏలూరు జిల్లాతో పాటు తూర్పు, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం కంపెనీలు పోటీపడి అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో గింజలను రూ.1,040 వరకూ కొనుగోలు చేసి, ఈ సంవత్సరం కంపెనీలు సిండికేట్‌గా మారి అంతర్జాతీయ ధర ఇవ్వడం లేదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని, పాత గింజలు వెంటనే కొనాలని, కంపెనీలు రైతులకు పెడుతున్న ఇబ్బందులను తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో రైతులు సంఘటితంగా లేకపోవడం వల్ల కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను ఇబ్బంది పెడుతున్నాయన్నారు. పాత గింజల కొనుగోలుపై కంపెనీలు స్పష్టత ఇవ్వడం లేదన్నారు. కంపెనీలు మాత్రం అన్ సీజన్ గింజలు కొనలేమని, నాణ్యత లేదని బుకాయిస్తూ రోజురోజుకీ ధర తగ్గించడం దారుణమని విమర్శించారు. ఇంతకు ముందు లేని గ్రేడింగ్ విధానాన్ని ముందుకు తీసుకొచ్చారన్నారు. కంపెనీలు కొత్త గింజలు కొంటామని, పాత గింజలు కొనలేమని చెప్పడం అన్యాయమన్నారు. కొత్త గింజలు రూ.650 నుంచి రూ.600లకు, ఇప్పుడు రూ.550లకు ధర తగ్గించారని, ఈ ధర మరింత తగ్గిస్తామని కంపెనీలు రైతులను బెదిరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ సీజన్ గింజలను రూ.200 నుండి రూ.240లకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతుల వద్దనున్న గింజలు కొనుగోలు చేయకుండా నిల్వ ఉంచిన గింజలను పచ్చుళ్లు పట్టుకోండంటూ రైతులను ఎగతాళి చేస్తూ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని, ఇటీవల ఎరువులు, పురుగుమందుల ధరలు, కూలీ ఖర్చులు పెరిగాయని, కోకో గింజల ధర పెరిగిన తర్వాత కౌలు రేట్లు పెరిగాయని చెప్పారు. ప్రస్తుతం కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని, అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం కోకో రైతులందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో విజయరాయి ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త మాధవీలత, పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం పరిధి ఆయిల్ పామ్ రైతుల సంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకటరావు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి, ప్రముఖ కోకో రైతులు పర్వతనేని గంగాధరరావు (బాబ్జి), బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి, రైతు సంఘం నాయకులు సిహెచ్.బాబూరావు, తూర్పుగోదావరి జిల్లా కోకో రైతు ఉప్పల కాశీ, కోనసీమ జిల్లా కోకో రైతు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, ఎన్‌టిఆర్ జిల్లా కోకో రైతు కొసరాజు రాధాకృష్ణ మాట్లాడారు.



అభివాదం చేస్తున్న నేతలు

సదస్సు తీర్మానం డిమాండ్లు..

1. అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా రైతులు వద్ద ఉన్న కోకో గింజలను కంపెనీలు వెంటనే కొనుగోలు చేయాలి.
2. కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను నష్టపర్చే చర్యలను అరికట్టాలి.
3. కంపెనీలు కొనుగోలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే కోకో గింజలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.
4. ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలి.
5. విదేశీ కోకో గింజలు, పొడి, బట్టర్ వంటి దిగుమతులు నిలుపుదల చేయాలి. రైతులను నష్టపరిచే పద్ధతుల్లో దిగుమతులు ఉండరాదు.
6. కోకో రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రాసెసింగ్ యూనిట్స్ నిర్మించాలి.
7. కోకో తోటలు సాగు చేస్తున్న రైతులకు ఉద్యాన శాఖ నుండి రావాల్సిన సబ్సిడీ బకాయిలు చెల్లించాలి.

విఆర్‌ఒల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అర్హులైన గ్రేడ్-1, విఆర్‌ఒలకు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు ఇవ్వాలని, గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు గ్రేడ్-1 విఆర్‌ఒలుగా ప్రమోషన్లు కల్పించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు జిల్లా కలెక్టర్‌ను కోరారు. గురువారం కలెక్టరేట్లో కలెక్టర్ వెట్రిసెల్విని విఆర్‌ఒల సంఘం నాయకులు కలిసి విఆర్‌ఒల సమస్యలపై చర్చించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భూపతి రాజు రవీంద్రరాజు మాట్లాడుతూ క్లస్టర్ విధానం పేరుతో రెవెన్యూ విలేజ్‌లకు సంబంధం లేకుండా రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం జరుగుతుందని, క్లస్టర్‌కు ఒక విఆర్‌ఒ ఉండేలా నిర్ణయం తీసుకోవడం వల్ల విఆర్‌ఒలకు పని భారం పెరుగుతుందన్నారు. దీనివల్ల రెవెన్యూ సేవలు కూడా ఆలస్యం అవుతాయని, ఈ నెల 25, 26వ తేదీల్లో ముఖ్యమంత్రితో రాష్ట్ర సచివాలయంలో జరిగే కలెక్టర్ల సదస్సులో ఈ క్లస్టర్ విధానం గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే ఇతర డిపార్ట్మెంట్ వర్కులు, సర్వేలు విఆర్‌ఒలకు మినహాయింపిస్తూ ముఖ్యమంత్రి ఆదేశాలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షులు రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అక్బర్, జిల్లా కోశాధికారి రవికుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల అసాధారణ ప్రతిభ

ఐఐటి రూర్‌కి గేట్ - 2025 పరీక్షల్లో 400 మంది విద్యార్థుల హవా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఐఐటి రూర్‌కి గేట్ - 2025 నిర్వహించిన పరీక్షల్లో ఆర్‌జియుకెటి విద్యార్థులు 400 మంది అద్భుతమైన ప్రతిభ కనపరచినట్లు నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడులో ఆయన గురువారం మాట్లాడుతూ నూజివీడు క్యాంపస్ విద్యార్థి అశోక్ అమిరెడ్డి కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆలిండియా 12వ ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. రానున్న ఏడాది మరి కొంతమంది విద్యార్థులు గేట్‌లో అర్హత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్లు అమరేంద్ర కుమార్ తెలిపారు. గేట్ పరీక్షకు శిక్షణ ఇచ్చేందుకు తోడ్పాటు అందించిన ఇటిపి సెల్ డీన్ పి.శ్యామ్‌కు ఈ సంర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. విభాగాల వారీగా ముఖ్యమైన ర్యాంకులకు సంబంధించి సమాచారం అందించారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో 12, ఇసిఇలో 125, మెకానికల్ 174, సిఎస్‌ఇ 152, ఇసిఇ 201, మెకానికల్ 240, 242, సిఎస్‌ఇలో 241, 298, 308, 342, సిఎస్‌ఇ 475, మెకానికల్ 484, 491, 585, ఇసిఇ 655, సిఎస్‌ఇ 663, కెమికల్ 666, ఇసిఇ 679, సిఎస్‌ఇ 680, 724, 783, 844, ఇసిఇ 875, 907, సిఎస్‌ఇ 915, 983 ర్యాంకులు సాధించినట్లు వివరించారు. మొత్తంగా ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు చెందిన ట్రిపుల్ ఐటి విద్యార్థులు 400 మంది అద్భుతమైన ప్రతిభ కనపరిచి రికార్డు సృష్టించినట్లు చెప్పారు. గేట్ ఎగ్జామ్స్ రాసేందుకు విద్యార్థుల కోసం సందేహాల నివృత్తి తరగతులు, గేట్ ఆన్‌లైన్ ప్రాక్టీస్ టెస్ట్ సర్వీసెస్, గేట్ సిలబస్‌కు సంబంధించిన నాన్ టెక్నికల్ సబ్జెక్టుల వీడియోలు చూపుతూ ప్రత్యేక శిక్షణ అందించినట్లు చెప్పారు. విద్యార్థుల విజయానికి తోడ్పాటును అందించిన ఆయా క్యాంపస్‌ల యాజమాన్యాలకు, అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య విజయకుమార్ విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ ఫలితాలు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లకు గొప్ప మణిహారం కాగలదని తెలిపారు.



అమరేంద్రకుమార్

ఆర్‌టిసి ప్రయివేటీకరణను నిలిపివేయాలి

24న చలో పార్లమెంట్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసిలు నేరుగా విద్యుత్ బస్సులను నిర్వహించుకునే అవకాశం కల్పించాలని, బడ్జెట్ కేటాయింపులు చేయాలని, ప్రయివేట్ విద్యుత్ బస్సుల కన్సార్టియంల పేరుతో ఆర్‌టిసిల ప్రయివేటీకరణను నిలిపివేయాలని, దేశంలోని రవాణా రంగ కార్మికులకు ఒక సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని ఏలూరు డిపోలో ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఇచ్చిన ఈ నెల 24న చలో పార్లమెంట్ కార్యక్రమంలో రవాణా రంగ కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరుతూ ఆర్‌టిసి స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు డిపోలో ఉద్యోగులు గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ బస్సుల పాలసీని 2018లో ప్రవేశపెట్టిన ఈ ప్రభుత్వం తిరిగి దానిని 2024 డిసెంబర్ 11న పునరుద్ధరించిందని, 2029 నాటికి మొత్తం ఆర్‌టిసిలో విద్యుత్ బస్సులతో నింపాలని సుస్థిర విద్యుత్ వాహనాల పాలసీ -4లో లక్ష్యంగా పెట్టారన్నారు. ఆర్‌టిసి యాజమాన్యం కూడా విద్యుత్ బస్సులను ప్రవేశపెడతామని పదేపదే ప్రకటనలు చేస్తున్నారన్నారు. విద్యుత్ బస్సుల పేరుతో మొత్తం ఎపిఎస్‌ఆర్‌టిసి మహా సంస్థను ప్రయివేట్ కార్పొరేటర్లకు అప్పజెప్పాలని నిర్ణయించవద్దని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలు ఆర్‌టిసిల విస్తరణకు పెను ప్రమాదంగా దాపురించాయని, ఆర్‌టిసి బస్సుల స్థానంలో దేశవ్యాప్తంగా విద్యుత్ బస్సులను తీసుకొని భవిష్యత్తులో ఆర్‌టిసిలను కనుమరుగు చేయాలని కేంద్ర ప్రభుత్వం పథకం వేసిందని, ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన పిఎం- ఈ బస్సు స్కీము కూడా ఇందులో భాగమేనన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడి ఆర్‌టిసిలను కాపాడుకోవాలని, మార్చి 24న ఢిల్లీలో భారీ ప్రదర్శనతో నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర, జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్, డిపో అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.ప్రసాద్, టికె.రావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు, ఉద్యోగులు

మత్తు పదార్థాల నివారణే లక్ష్యం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. ఏలూరు కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో నార్కోటిక్ కో-ఆర్డినేషన్ సమావేశంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారి కె.రత్నప్రసాద్‌తో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి హాజరయ్యారు. డ్రగ్స్ నివారణ, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1972 విస్తృత ప్రచారానికి సంబంధించి ప్రచురించిన స్టిక్కర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి నిర్మూలనకు వచ్చే విద్యా సంవత్సరం నాటికి యాంటీనార్కోటిక్ టాస్క్ ఫోర్స్(ఈగిల్ క్లబ్‌లు) అన్ని విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్ నివారణ, ఫిర్యాదులు చేసేందుకు, సహాయం కోసం 1972 టోల్ ఫ్రీ నెంబరుకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసే ఈగిల్ క్లబ్‌లన్నింటికి కలిపి వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా భద్రతను దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు వంద మీటర్ల పరిధిలో ఏమైనా మద్యం దుకాణాలు ఉంటే సమాచారం అందించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లాలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై విద్యా సంస్థలతోపాటు పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు బి.శ్రీలత, డిఎఫ్ఒ శుభమ్, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.ప్రభుకుమార్, జిల్లా మద్య నిషేధ అబార్కి అధికారి ఎ.ఆవులయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పాండురంగారావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, జెడ్‌పి సిఇఒ భీమేశ్వరరావు, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, డిఐఇఒ ప్రభాకరరావు, ఆర్‌ఐఒ యోహాన్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ అధికారి రామ్‌కుమార్, కమిటీ సభ్యులు మళ్లిపూడి కనకదుర్గాదేవి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సంవత్సర కాలంగా ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లను వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోపిదేవి రవీంద్రరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున ఏలూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వెట్రిసెల్వికి గురువారం వినతిపత్రం అందించారు. అనంతరం రవీంద్ర రాజు మీడియాతో మాట్లాడుతూ సంవత్సర కాలంగా ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసి గ్రేడ్-1 వీఆర్‌ఓలుగా ఉన్న వారిని సీనియర్ అసిస్టెంట్లుగా, గ్రేడ్-2 వీఆర్‌ఓలుగా ఉన్నవారిని గ్రేడ్-1 వీఆర్‌ఓలుగా భర్తీ చేయాలని కోరారు. ఈ నెల 25, 26 తేదీల్లో విజయవాడలో కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబుతో సమావేశం ఉన్నందున, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపారు.

అనారోగ్యంతో టిడిపి నేత మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

నిరంతరం కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టిడిపి పని చేస్తుందని మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నల్లూరి వెంకట చలపతి రావు తెలిపారు. మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గుంజల సత్యనారాయణ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి టిడిపి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.ఐదు వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.జగ్గవరం సొసైటీ మాజీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షులు మద్దిపాటి దుర్గారావు, కేసిన వెంకటేశ్వరావు, బొంతు వెంకట శ్రీనివాసరావు, నెక్కలపూడి రామ చంద్రరావు, దేవరపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ గ్రామస్తుడు బొబ్బిలి సన్యాసిరావు పొలంలో పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రెండు చేతులకు గాయాలు కావడంతో కొంతకాలంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. సన్యాసిరావుకు గురువారం మానవత సంస్థ తరఫున వైద్య ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేలు గ్రామ సర్పంచ్ సబ్బారపు శ్రీరామచంద్రమూర్తి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ ప్రెసిడెంట్ పూనెం పోసి బాబు, ఛైర్మన్ తెలగారెడ్డి వెంకటేశ్వరరావు, కన్వీనర్ ఆకుల నరసింహమూర్తి, కో ఛైర్మన్ చిలక రాంబాబు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో విద్యుత్ మీటర్ రీడర్లకు విద్యుత్ శాఖలోనే ప్రత్యామ్నాయం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏలూరు విద్యుత్ శాఖ ఎస్‌ఇ కార్యాలయం వద్ద ఏఐటియుసి అనుబంధ ఏపి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం యూనియన్ నాయకులు ఎస్‌ఇకి వినతిపత్రం అందించారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కోశాధికారి కె.మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ మీటర్ రీడర్లకు వాళ్ల విద్యార్హతను బట్టి విద్యుత్ శాఖలోనే ఉపాధి కల్పించాలని వారు కోరారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా శ్రీనివాసబాబు

ప్రజాశక్తి - పోలవరం

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్.శ్రీనివాసబాబుకు ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావును మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శాలువా కప్పి సన్మానించి పూలమాలలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ సిబ్బంది, పట్టిసీమ కార్యదర్శి యు.రాజారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గంగరాజు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

గొప్ప వ్యక్తుల జీవిత విశేషాలను, వారి జీవిత సాహస గాథలను విద్యార్థులు తెలుసుకుని ప్రేరణ పొంది చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు అన్నారు. విజ్ఞాన శాస్త్ర విశిష్ట అంతరిక్ష వ్యోమగామి సునీత విలియమ్స్ సుదీర్ఘ విజయ గాథ అంశంపై పాఠశాలలో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రధరరావు మాట్లాడుతూ వ్యోమగామి సునీత విలియమ్స్, బుచ్ విల్ మోర్ అంతరిక్షంలో చిక్కుకున్న విషయం తెలిసిందన్నారు. తొమ్మిది నెలలు అంతరిక్షంలో ధైర్యంగా గడిపి ఈ నెల 18వ తేదీ తెల్లవారుజామున దిగ్విజయంగా భూమిని చేరినందుకు ప్రపంచమంతా వారికి ఘన స్వాగతం తెలియజేసిందని తెలిపారు. ఒక్కసారిగా అందరి నోటా సునీత విలియమ్స్ ధైర్య సాహసాలు ప్రతిధ్వనించాయని కొనియాడారు.

పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఏడాది మార్చి 20వ తేదీన ఈ దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. పిచ్చుకల జాతి సంరక్షణ, వాటి అవసరాన్ని గుర్తించి వాటిని కాపాడుకునేందుకు ప్రజలను ఏకం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని విద్యార్థి కె.సుస్మిత వివరించారు. ఇళ్ల మధ్యలో సెల్ టవర్లు ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ ప్రభావం ఎక్కువగా ఉండి గుండె నాడీ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం కలిగి పిచ్చుకలు ఎక్కువగా చనిపోతున్నాయన్నారు. దీని నుంచి పక్షులను కాపాడటానికి చెట్ల పెంపకం, పరిసరాల పచ్చదనం పట్ల ప్రతి ఒక్క మనిషి శ్రద్ధ వహించాలన్నారు. అదే విధంగా విద్యార్థులు పిచ్చుక ఆకారంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

నూజివీడు టౌన్:పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో పోక్సో చట్టంపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్ పర్సన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థినులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు కె.ఉషారాణి, ఎం.వెంకటరమణ, మహిళా న్యాయవాది పద్మాంజలి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పంచాయతీ కార్యాలయంలో చోరీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు పంచాయతీ కార్యాలయంలో బీరువాలోని రూ.91 వేల నగదు అపహరణకు గురైంది. గురువారం ఉదయం కార్యాలయం తెరిచి చూసేసరికి బీరువా తాళాలు పగలు కొట్టి ఉన్నట్లు గుర్తించారు. పంచాయతీ పన్నులు వసూలైన సొమ్ము రూ.91 వేలు బుధవారం రాత్రి బీరువాలో పెట్టారు. తెల్లారేసరికి ఆసొమ్మును గుర్తుతెలియని వ్యక్తులు దొంగించినట్లు భావిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముసునూరు

నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.నాగప్రభుకుమార్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిహెచ్.అజయ్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో ముసునూరులో గురువారం దాడులు చేశారు. ఈ దాడిలో కుప్పాల మంగమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు సారా సరఫరా చేస్తున్న నూజివీడు మండలంలోని ఒగిరాలతండా గ్రామానికి చెందిన స్వామిపై కూడా కేసు నమోదు చేసినట్లు సిహెచ్.అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు.

19 మందికి బైండోవర్

నూజివీడు టౌన్ : మండలంలోని ఓగిరాలతండా గ్రామానికి చెందిన 19 మందిని నాటుసారా కేసులో నిందితులను తహాశీల్దార్ ఎదుట గురువారం బైండోవర్ చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. తహాశీల్దార్ బి.సుబ్బారావు మాట్లాడుతూ ఈ బైండోవర్ ఒక సంవత్సర కాల పరిమితి ఉంటుందని, మళ్లీ ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా, ప్రభుత్వ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. సారా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ మస్తానయ్య తెలిపారు.

బోస్‌ను హత్య చేసినవారిని అరెస్టు చేయాలి

మృతదేహంతో గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం గ్రామానికి చెందిన గంధం బోస్ (36)పై కత్తితో దాడి చేసి హత్యకు పాల్పడిన నిందితుల పేర్లను బయటపెట్టి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద జాతీయ రహదారిపై మృతదేహంతో గ్రామస్తులు ధర్నా చేపట్టారు. దీంతో జాతీయ రహదారిపై ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరావు, నియోజకవర్గ పరిధిలోని సిఐలు, ఎస్‌ఐలు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. గ్రామస్తులు ధర్నా విరమించకపోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరావు మాట్లాడుతూ నిందితులను త్వరలోనే బయట పెట్టి మృతునికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అందుబాటులో సీనియారిటీ జాబితా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితా ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించి, ఈ నెల పదో తేదీ వరకు అభ్యంతరాలను తీసుకోని వాటిని సరిచేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబితాలు సంబంధిత పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ www.deoeluru.org వెబ్‌సైట్‌లో, నోటీసు బోర్డుల్లో 20వ తేదీ నుంచి అందుబాటులో ఉంటుందని, సీనియారిటీ జాబితాపై ఎవరైనా అభ్యంతరాలు కలిగి ఉంటే 25వ తేదీ లోపు వాటిని సంబంధిత జిల్లా విద్యాశాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పాఠశాల విద్యాశాఖ కార్యాలయాలనికి అందించవచ్చని తెలిపారు.

కంకర తవ్వకాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

కేసు నమోదు లేకుండా తాత్సార్యం చేస్తున్నారని ప్రజల విమర్శ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని గోపీనాథపట్నం కాలనీ వెనుక భాగంలో ఎలాంటి అనుమతులు లేకుండా కంకర తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కంకర లోడుతో కొంత దూరం వెళ్లాక ఆ లారీ మార్గమధ్యలో మరమ్మతుల కారణంగా ఆగిపోవడంతో ఆ టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నామని, పొక్లెయిన్, ఇతర వాహనాలు తప్పించుకుపోయాయని విఆర్‌ఒ దుర్గాప్రసాద్ వెల్లడించారు. టిప్పర్‌ను తహశీల్దార్ కార్యాలయానికి తరలించి మైనింగ్ అధికారులకు రిపోర్టు పంపుతామని, వారు వచ్చి కొలతలు వేస్తే తదుపరి శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తహశీల్దార్ పూర్ణచంద్రప్రసాద్ చెప్పారు. అక్కడికక్కడే తవ్వకం రవాణా చేస్తున్నామని, బయటకు తోలడం లేదని, మూడు రోజుల నుంచి తవ్వుతున్నామని మా లారీని ఎందుకు ఆపారని కూటమి నాయకుడైన టిప్పర్ యజమాని దురుసుగా, దౌర్జన్యంగా మాట్లాడుతున్నారని రెవెన్యూ అధికారులు వాపోయారు. పట్టుబడిన టిప్పర్ యజమాని కూటమి పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో కేసు, ఫైన్ తదితర చర్యలు లేకుండా బయటకు పడేలా తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది.అక్రమంగా మైనింగ్ చేసేవారిని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అధికారులు చెప్పారు.

ఎంబిబిఎస్ పరీక్ష ఫలితాల్లో 'ఆశ్రం'కు 2, 3 ర్యాంకులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

2024 సంవత్సరానికి జరిగిన ఎంబిబిఎస్ పరీక్ష ఫలితాల్లో 95 శాతం ఉత్తీర్ణత శాతంతో యూనివర్సిటీ స్థాయిలో రెండు, మూడు ర్యాంకులు సాధించి ఆశ్రం మెడికల్ కాలేజీని ఆదర్శప్రాయంగా నిలిపారని ఆశ్రం మెడికల్ కళాశాల సిఇఒ డాక్టర్ హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికతను, సదుపాయాలను, ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని విద్యార్థులను తయారు చేస్తున్న అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఆశ్రం గ్రూప్ ఆఫ్ డైరెక్టర్ జి.రతీదేవి విద్యార్థులకు, అధ్యాపక బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆశ్రం కళాశాల ప్రిన్సిపల్ చేబ్రోలు శ్రీనివాస్ మాట్లాడుతూ మరింత మంది ప్రతిభవంతులను తయారు చేసేందుకు ఈ విజయం సహకరించిందని, దీని స్ఫూర్తితో మరిన్ని సదుపాయాలను సాంకేతికతను జోడించి ఆశ్రం మెడికల్ కాలేజీలో చదివిన ప్రతి ఒక్క విద్యార్థిని ప్రతిభవంతునిగా, నిష్ణాతులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆశ్రం మెడికల్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ అంజిరెడ్డి మాట్లాడుతూ ఆశ్రం విద్యాసంస్థలు తమ విద్యార్థులకు నాణ్యమైన విలువలతో కూడిన వైద్య విద్యను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు నూతన విధానాలను అవగాహన కల్పించే దిశగా ప్రయత్నిస్తున్నామని, ప్రతి ఒక్కరికీ వైద్యం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

'అనధికార, ఆక్రమణ క్రమబద్ధీకరణ'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

అభ్యంతరకర ప్రభుత్వ భూమిపై అనధికార ఆక్రమణ క్రమబద్ధీకరణ పథకం-2025 ప్రకారం 2019 అక్టోబర్ 15వ తేదీ కంటే అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఆక్రమించుకుని నివాసం ఉంటున్నవారికి సదరు ఇంటి స్థలాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తహశీల్దార్ జెవి.సుబ్బారావు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు మీసేవ, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

నోటి శుభ్రతతో ఆరోగ్యానికి భద్రత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, దంత వైద్య నిపుణులు సిహెచ్.దినేష్ మాట్లాడుతూ నిత్యం రెండు పర్యాయాలు నిద్ర లేవగానే, రాత్రి నిద్రించే ముందు పళ్లు, నోరు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి ప్రతిఒక్కరూ దంత వైద్యులను సంప్రదించాలన్నారు. నోటి పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవడంతో ఆరోగ్యానికి పూర్తిస్థాయి భద్రత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ హరికృష్ణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

టి.నరసాపురం:వేసవిలో ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని కృష్ణాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు భూక్యా నాగమణి తెలిపారు. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు వద్ద పంచముఖ హనుమాన్ దేవాలయం సెంటర్‌లో బంజారా భజరంగీ భేరీ, భూక్యా గోపయ్య సక్రమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం బోడా దృత్విక్ నాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు బాటసారులకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు.

రూ.1.86 కోట్లతో యాక్షన్ ప్లాన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని రూ.1.86 కోట్లతో యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు ఎంపిడిఒ రాఘవేంద్రనాథ్ తెలిపారు. నూజివీడులో ఆయన గురువారం మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు చెందిన కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బృహత్తర ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగానే బిసి, కాపు, క్షత్రియ, ఇబిసి తరగతులకు చెందినవారు ఈ నెల 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు సమీపంలోని సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. తమకు అందిన దరఖాస్తుల్లో 75 మందిని ఎంపిక చేసి ఆర్థిక స్వయం సమృద్ధి పొందేందుకు రూ.1.86 కోట్లను రుణాలుగా అందించనున్నట్లు వివరించారు.

మహారాజశ్రీ నూజివీడు సివిల్ జడ్జి వారి కోర్టులో

యస్.ఓ.పి.నెం. 1/2025

బిట్వీన్:-

1. మిర్యాల వెంకట శ్రీ నాగేంద్రరావు
2. మిర్యాల వినయ్ హర్ష
3. తుమ్మలపెంట సుహాసిని ...పిటీషనర్స్

మరియు

1 నిల్. ...రెస్పాండెంట్

యిందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, పై పిటీషన్‌లోని 1వ పిటీషనర్‌కు భార్య మరియు 2 టూ 3 పిటీషనర్స్‌కు తల్లి గారైన మిర్యాల లలిత **ది. 29-12-1999వ తేదీన** ఇంటస్టేట్‌గా మరణించియున్నారు. సదరు మిర్యాల లలిత గారికి రావలసిన అమర్ రాజా షేర్సు సొమ్ము రూ. 15,69,675/- లను మరియు దానిపై వచ్చు వడ్డీ మరియు యితర లావీదేవీలు సదరు మిర్యాల లలిత గారి ముఖ్య వారసులైన పిటీషనర్స్‌కు తీసుకొనుటకు గానూ, వారు సక్సెషన్ సర్టిఫికేట్‌ను కోర్టు ద్వారా పొంది, తద్వారా పై తెలిపిన సొమ్మును పొందుటకు గానూ పై తెలిపిన పిటీషనర్స్, పై నెంబరు సక్సెషన్ ఓ.పి. దాఖలు చేసుకొనియున్నారు. సదరు పై తెలిపిన పిటీషనర్స్, సదరు మరణించిన మిర్యాల లలిత గారి యొక్క వారసులుగా శ్రీ కోర్టు వారి వద్ద నుండి సక్సెషన్ సర్టిఫికేట్ పొందుటలో ఎవరికైననూ ఏ విధమైన అభ్యంతరములు వున్న యెడల **ది. 01-05-2025 వ తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో పై తెలిపిన పిటీషనర్స్ సదరు మరణించిన శ్రీ మిర్యాల లలిత గారి వారసులుగా భావించి, కోర్టు వారు తగు ఉత్తర్వులను జారీచేయగలరని తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి. లక్ష్మీనారాయణ,
పైలా దుర్గా ప్రసాద్

నూజివీడు — పిటీషనర్స్ తరపు న్యాయవాదులు
ది. 20-03-2025 — నూజివీడు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) నంద్యాల

O.S.No.211/2020

బందెల అభిషేక్, మైనర్ అయినందున గార్డియన్ బందెల మరియమ్మ. ...వాది

-వర్సెస్-

1) బందెల ఎడ్వర్డ్ విజయబాబు మరియు ఇతరులు ...ప్రతివాదులు

1వ ప్రతివాదికి దావా సమను ప్రకటన

1వ ప్రతివాది చిరునామా :

బందెల ఎడ్వర్డ్ విజయబాబు, తండ్రి- లేట్ బందెల శిఖామణి, ఇ.నెం.9-20-19, శ్రీ కంచి శంకర విద్యాలయ యు.పి.స్కూల్ (ఇంగ్లీష్ మీడియం) ఎదురుగా, రామారావు పేట, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలోని వాది ప్రతివాదుల పైన దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో తనకు గల భాగమును పంచి మరియు స్వాధీనము చేయవలసినదిగా కోరుతూ దావాను దాఖలు చేసియుంటున్నారు. కావున 1వ ప్రతివాది అయిన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట 7-5-2025వ తేదీన హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనంతట కోర్టు వారు నీ పరోక్షమందు తీర్మానించెదరని యిందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 7-5-2025

శ్రీ ఎ. శ్రీనివాస శర్మ,
వాదిపరం అడ్వకేట్, నంద్యాల.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) నంద్యాల

I.A.No.428/2020 IN O.S.No.211/2020

బందెల అభిషేక్, మైనర్ అయినందున గార్డియన్ బందెల మరియమ్మ. ...పిటిషనర్

-వర్సెస్-

1) బందెల ఎడ్వర్డ్ విజయబాబు మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

1వ రెస్పాండెంటుకు నోటీసు ప్రకటన

1వ రెస్పాండెంట్ చిరునామా :

బందెల ఎడ్వర్డ్ విజయబాబు, తండ్రి- లేట్ బందెల శిఖామణి, ఇ. నెం. 9-20-19, శ్రీ కంచి శంకర విద్యాలయ యు.పి. స్కూల్ (ఇంగ్లీష్ మీడియం) ఎదురుగా, రామారావు పేట, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలోని పిటిషన్ I.A.No.428/2020 నందు వాది ప్రతివాదులపైన పిటిషన్ షెడ్యూలు దాఖలా ఆస్తిని ఇతరులకు విక్రయించకుండా నిలుపుదల కోరుతూ ఇంజంక్షన్ ఉత్తర్వులకై పిటిషన్ దాఖలు చేసియుంటున్నారు. కావున 1వ రెస్పాండెంట్ అయిన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట 7-5-2025వ తేదీన హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనంతట కోర్టు వారు నీ పరోక్షమందు తీర్మానించెదరని యిందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 7-5-2025

శ్రీ ఎ. శ్రీనివాస శర్మ,
వాదిపరం అడ్వకేట్, నంద్యాల.

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 12(1744533)/2019/డి.బి — ది.19-03-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో షార్టు టెండరు నోటీసు నెం.27 (1) /BHI/General/2024-25/E2 & టెండరు నోటీసు నెం.27 (2-10) BHI/ BPSLRS/ General /2024-25/E1/E2 & టెండరు నోటీసు నెం.27 (11-12) BHI/15th FC/2024-25/E1 లోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి 2 పనులకు గాను రూ. 63.31 లక్షలు, BPS LRS నిధుల నుండి 7 పనులకు గాను రూ. 34.20 లక్షలు, జనరల్ నిధుల నుండి 1 పనికి గాను రూ. 5.00 లక్షలు మరియు జనరల్ ఫండ్స్ నుండి 3 పనులకు సంబంధించి రూ. 38.20 లక్షలతో ఇ-ప్రొక్యురుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్ నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యురుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, భీమవరం పురపాలక సంఘము, ప॥గో॥జిల్లా (సెల్: 9849906540, 9849906543 వారిని సంప్రదించగలరు.

కమీషనరు,
భీమవరం పురపాలక సంఘం

MUNICIPAL CORPORATION, ELURU

Tender Notice No:116/Gen/2024-2025, Dt:20-03-2025

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible Contractors for **"Supply and Delivery of necessary accessories for the erecton of 50HP DAM and 90HP DAM vertical open well submersible pump set & Supply, Delivery and Fixing of Vertical Turbine Pump at Denduluru raw water pumping station of Eluru Municipal Corporation."** with an amount of Rs. **79.60** Lakhs for 2 works.

Last date For receipt of application towards tender schedule is 27-03-2025. Last date of receipt of tenders is 28-03-2025. Further details can be known from this office detailed tender notice or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-232101).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU

గ్రామపంచాయతీ కార్యాలయము, తరటవ

టెండరు ప్రకటన — తేది.19-03-2025

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, తరటవ గ్రామపంచాయతీకి 2025-26 సంవత్సరమునకు ఈక్రింది వివరించిన ప్రకారము ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 సంవత్సరము వరకు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 27-03-2025వ తేదీ గురువారం ఉదయం గం. 11.00 గ॥ల నుండి మధ్యాహ్నం 1.00 గం॥ల వరకు స్వీకరించబడి, అదే రోజు మధ్యాహ్నం 3.00 గం॥లకు టెండర్లదారుల సమక్షంలో తెరవబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకొని పోస్టు ఒక్కంటికి రూ. 50/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు షరతులు కార్యాలయము పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం.	పనిపేరు	కావలసిన వ్యక్తుల సంఖ్య
1	పారిశుధ్యం నిర్వహణ (గ్రీన్ అంబాసిడర్)	01
2	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ మోటర్ స్విచ్ ఆపరేటర్ మరియు పైప్ లైను రిపేర్ మరియు (శుభ్రపరుచుటకు మరియు క్లోరినేషన్) లు. ఆర్.ఎస్.హెచ్.ఓ	01
3	వీధి దీపములు పనుల నిర్వహణ	01
4	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ సామాన్లు టెండర్ ద్వారా పంపిణీ చేయుట	-
5	శానిటేషన్ నిర్వహణ బ్లీచింగ్, ముగ్గు సరఫరా చేయడానికి టెండర్ ద్వారా పంపిణీ చేయుట	-

సం/- **ఎమ్.పవన్ కుమార్**
గ్రామపంచాయితీ కార్యదర్శి, తరటవ, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయము, మందపాడు

టెండరు ప్రకటన — తేది.06-03-2025

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, మందపాడు గ్రామపంచాయతీకి 2025-26 సంవత్సరమునకు ఈక్రింది వివరించిన ప్రకారము ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 సంవత్సరము వరకు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 26-03-2025వ తేదీ బుధవారం ఉదయం గం. 11.00 గ॥ల నుండి మధ్యాహ్నం 1.00 గం॥ల వరకు స్వీకరించబడి, అదే రోజు మధ్యాహ్నం 2.00 గం॥లకు టెండర్లదారుల సమక్షంలో తెరవబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకొని పోస్టు ఒక్కంటికి రూ. 100/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు షరతులు కార్యాలయము పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం.	పనిపేరు	కావలసిన వ్యక్తుల సంఖ్య
1	పారిశుధ్యం నిర్వహణ ((గ్రీన్ అంబాసిడర్)	01
2	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ (మోటర్ స్విచ్ ఆపరేటర్ మరియు పైప్ లైను రిపేర్ మరియు ఓ.హెచ్.ఎస్.ఆర్.లు శుభ్రపరుచుటకు మరియు క్లోరినేషన్)	01
3	వీధి దీపములు పనుల నిర్వహణ	01

టెండర్ దరఖాస్తు ఫారం మరియు టెండర్ దాఖలు చేయుటకు గానూ నియమావళి మరియు ఇతర విషయము కొరకు ఆఫీస్ పనిచేయు వేళలలో సంబంధిత పంచాయితీ కార్యదర్శి గ్రామపంచాయితీ వారి నుండి పూర్తి వివరములు పొందగలరు.

సం/- **జి. లలిత కుమారి**
గ్రామపంచాయితీ కార్యదర్శి, మందపాడు, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయము, గుమ్ములూరు

టెండరు ప్రకటన — తేది.19-03-2025

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, గుమ్ములూరు గ్రామపంచాయతీకి 2025-26 సంవత్సరమునకు ఈక్రింది వివరించిన ప్రకారము ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 సంవత్సరము వరకు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 27-03-2025వ తేదీ గురువారం ఉదయం గం. 11.00 గ॥ల నుండి మధ్యాహ్నం 1.00 గం॥ల వరకు స్వీకరించబడి, అదే రోజు మధ్యాహ్నం 3.00 గం॥లకు టెండర్లదారుల సమక్షంలో తెరవబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకొని పోస్టు ఒక్కంటికి రూ. 50/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు షరతులు కార్యాలయము పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం.	పనిపేరు	కావలసిన వ్యక్తుల సంఖ్య
1	పారిశుధ్యం నిర్వహణ (గ్రీన్ అంబాసిడర్)	01
2	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ మోటర్ స్విచ్ ఆపరేటర్ మరియు పైప్ లైను రిపేర్ మరియు (శుభ్రపరుచుటకు మరియు క్లోరినేషన్) లు. ఆర్.ఎస్.హెచ్.ఓ	01
3	వీధి దీపములు పనుల నిర్వహణ	01
4	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ సామాన్లు టెండర్ ద్వారా పంపిణీ చేయుట	-
5	శానిటేషన్ నిర్వహణ బ్లీచింగ్, ముగ్గు సరఫరా చేయడానికి టెండర్ ద్వారా పంపిణీ చేయుట	-

సం/- **ఎమ్.పవన్ కుమార్**
గ్రామపంచాయితీ కార్యదర్శి, గుమ్ములూరు, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయము, చిన్నఆగిరిపల్లి

టెండరు ప్రకటన — తేది.19-03-2025

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, చిన్నఆగిరిపల్లి గ్రామపంచాయతీలో కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ఈ క్రింది పనులు నిర్వహించుటకు ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 వరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఈ టెండర్లు ది. 25-03-2025వ తేదీ ఉదయం 11.00 గంటలకు చిన్నఆగిరిపల్లి పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిచే గానీ లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడి, అదేరోజు సాయంత్రం 4.00 గం॥లకు హాజరైన టెండర్లదారుల సమక్షంలో సీల్డు టెండర్లు తెరవబడును. ప్రభుత్వ నిబంధనలకు లోబడి టెండర్లు దాఖలు చేయవలెను. ఇతర వివరముల కొరకు కార్యాలయం పనిచేయు వేళలయందు పంచాయితీ కార్యదర్శిని అడిగి తెలుసుకొనగలరు.

వ.నెం.	పనిపేరు	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1	ట్యాంక్ ఆపరేటర్లు	4	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
2	ఎలక్ట్రీషియన్లు	2	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-
3	స్వీపరు	1	1-4-2025 నుండి 31-3-2026 వరకు	500/-

నోట్: 1) గతంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) పంచాయితీ నిధులు, నిల్వలను బట్టి పేమెంట్ చెల్లించబడును. 3) ఎలక్ట్రీషియన్ పని కొరకు దరఖాస్తు చేసుకొన్న వారు సంబంధిత ప్రావీణ్యతా ధ్రువీకరణ పత్రంను సమర్పించవలెను. 4) టెండర్లను స్వీకరించుటకు లేదా తిరస్కరించుటకు పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

సం/- **పసుపులేటి వినోద్ కుమార్**
గ్రామపంచాయితీ కార్యదర్శి, చిన్నఆగిరిపల్లి, ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సం/- **పల్లగాని రమాదేవి**
సర్పంచ్, చిన్నఆగిరిపల్లి గ్రామపంచాయితీ, ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.

సొసైటీ మహాజనసభ వాయిదా

టి.నరసాపురం :టి.నరసాపురం సొసైటీ మహా జన సభ వాయిదా వేసినట్లు సొసైటీ అఫీషియల్ కమి టీ చైర్‌పర్సన్ మాధవి మూర్తి తెలిపారు. స్థానిక సొసైటీ సహకార రత్న రైతు ప్రాంగణంలో గురు వారం నిర్వహించ తలపెట్టిన మహా జన సభ కోరం లేక వాయిదా వేశారు. మళ్లీ నిర్వహించే మ హాజన సభ తేదీని ముందుగా రైతులకు కాన్వా సింగ్ ద్వారా తెలియపరుస్తామని ఆమె తెలిపారు.

అనారోగ్య బాధితురాలికి సాయం

దెందులూరు :శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సేవ కార్యక్రమంలో భాగంగా ఏలూరు మండలం కొమడవోలు గ్రామ పంచాయతీ సాయినగర్ గ్రామానికి చెందిన సన్యాసమ్మకు క్యాన్సర్ ట్రీట్‌మెంట్ నిమిత్తం రూ.పది వేలు జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జి.కృష్ణ, పి.సురేష్‌బాబు, పి.వెంకటరమణ, సిహెచ్.శ్రీధర్, జి.శ్రీనివాస రావు, జి.ప్రకాష్, డికెఎస్ఎస్.ప్రకాష్, బిహెచ్.కోటేశ్వరరావు, కె.రవికుమార్, జి.మోహన్, ఇ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఫస్ట్ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కం ఫస్ట్ అడిషినల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్, పాలకొల్లు

ఐ.ఎ.నెం. 496/2024

ఒ.యస్.నెం. 93/2023

బిట్వీన్:-

పిటీషనరు/వాది: దాసరి దుర్గమ్మ

మరియు

రెస్పాండెంట్లు/ప్రతివాదులు: యల్లమెల్లి మంగమ్మ వగైరాలు

టూ:

2వ రెస్పాండెంట్/ప్రతివాది

యల్లమెల్లి రామకృష్ణ, తండ్రి: (లేటు) ఆంజనేయులు, రాళ్ళచెరువుగట్టు, కాపవరం విలేజ్, పాలకొల్లు మండలం.

పై నెంబరు పిటీషనులో 2వ రెస్పాండెంటు మరియు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను రిజిష్టరు పోస్టు ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొనియుండుట లేదు. అందువలన మీరు ది. **03-04-2025 వ తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై పై కోర్టు వారి యెదుట మీ ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

బి. శ్రీనివాసరావు

పాలకొల్లు — పిటీషనర్స్ తరపు న్యాయవాది
20-03-2025 — పాలకొల్లు
సెల్: 98665 10461

మహారాజశ్రీ తణుకు సబ్ కోర్టు వారి కోర్టులో

ఐ.ఎ.నెం.1/2024, ఐ.ఎ.నెం.608/2021

ఓ.యస్.నెం.56/2017

Between :

1.శ్రీ దాసం వెంకట సుబ్బారావు (Died) ..వాది

2.శ్రీమతి ఇంటూరి అనంత లక్ష్మి సూర్యకుమారి ...ప్రపోజెడ్ పిటీషనర్

అండ్

శ్రీ వైట్ల రామమూర్తి అండ్ అదర్స్ ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

2.శ్రీమతి దాసం సత్యవతి, W/o.దాసం వెంకట సుబ్బారావు, స్త్రీ, వయస్సు 68 సం॥లు, గణేష్ మహల్ స్ట్రీట్, తణుకు రోడ్, అత్తిలి.

3.శ్రీ దాసం వీర వెంకట సత్యనారాయణ, S/o.వెంకట సుబ్బారావు, పురుషుడు, వయస్సు 50 సం॥లు, హెడ్ మాస్టర్, గణేష్ మహల్ స్ట్రీట్, తణుకు రోడ్, అత్తిలి మరియు కడియెద్ద, తాడేపల్లిగూడెం మండలం.

పిటిషనర్/వాది దాఖలు చేసిన ప్రకటన :

పై నెంబర్ గ్రంథంలో పిటీషనర్, మిమ్ములను వాది యొక్క వారసులుగా, 2 మరియు 3వ ప్రతివాదిగా అనగా దావా నందు వాది చనిపోయినందునా, ప్రపోసెడ్ పిటీషనర్ 2వ వాదిగా చేర్చమని పిటిషన్‌లో వాది యొక్క వారసులను అయిన 1 టు 3 ప్రతివాదులుగా చేర్చమని పిటిషన్ దాఖలు చేయగా శ్రీకోర్టు వారు మీకు నోటీసు ఆర్డర్ వేయగా, మీరు కావాలని అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు మీకు నోటీసు అమలు నిమిత్తం పేపర్ ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ వేసినారు. కావున మీరు 26-03-2025వ తేదీన ఉదయం గం.10.30 లకు శ్రీకోర్టు వారి ముందు మీరు స్వయముగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీకు ఏమైన ఆక్షేపణలు వున్న తెలియచేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున పై కోర్టు వారు తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఐనంపూడి కామేశ్వరరావు
ఐనంపూడి శ్రీదేవికృష్ణవేణి,
అడ్వకేట్స్, తణుకు.

ది.20-3-2025 — సెల్:9966499955

మహారాజశ్రీ తణుకు సబ్ కోర్టు వారి కోర్టులో

ఐ.ఎ.నెం.1/2024, ఐ.ఎ.నెం.609/2021

ఓ.యస్.నెం.57/2017

Between :

1.శ్రీ దాసం వెంకట సుబ్బారావు (Died)

2.శ్రీమతి ఇంటూరి అనంత లక్ష్మి సూర్యకుమారి ...పిటీషనర్/వాది

అండ్

శ్రీ వైట్ల రామమూర్తి అండ్ అదర్స్ ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

2.శ్రీమతి దాసం సత్యవతి, W/o.దాసం వెంకట సుబ్బారావు, స్త్రీ, వయస్సు 68 సం॥లు, గణేష్ మహల్ స్ట్రీట్, తణుకు రోడ్, అత్తిలి.

3.శ్రీ దాసం వీర వెంకట సత్యనారాయణ, S/o.వెంకట సుబ్బారావు, పురుషుడు, వయస్సు 50 సం॥లు, హెడ్ మాస్టర్, గణేష్ మహల్ స్ట్రీట్, తణుకు రోడ్, అత్తిలి మరియు కడియెద్ద, తాడేపల్లిగూడెం మండలం.

పిటిషనర్/వాది దాఖలు చేసిన ప్రకటన :

పై నెంబర్ గ్రంథంలో పిటీషనర్, మిమ్ములను వాది యొక్క వారసులుగా, 2 మరియు 3వ ప్రతివాదిగా అనగా దావా నందు వాది చనిపోయినందునా, ప్రపోసెడ్ పిటీషనర్ 2వ వాదిగా చేర్చమని పిటిషన్‌లో వాది యొక్క వారసులను అయిన 1 టు 3 ప్రతివాదులుగా చేర్చమని పిటిషన్ దాఖలు చేయగా శ్రీకోర్టు వారు మీకు నోటీసు ఆర్డర్ వేయగా, మీరు కావాలని అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు మీకు నోటీసు అమలు నిమిత్తం పేపర్ ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ వేసినారు. కావున మీరు 26-03-2025వ తేదీన ఉదయం గం.10.30 లకు శ్రీకోర్టు వారి ముందు మీరు స్వయముగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయి మీకు ఏమైన ఆక్షేపణలు వున్న తెలియచేసు కొనవలెను. లేనిచో మీ పరోక్షమున పై కోర్టు వారు తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

ఐనంపూడి కామేశ్వరరావు
ఐనంపూడి శ్రీదేవికృష్ణవేణి,
అడ్వకేట్స్, తణుకు.

ది.20-3-2025 — సెల్:9966499955